సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



జైనుల నీరాజనం

జైనులకు ప్రీతిపాత్రం పెద అమిరంలోని ఋషభ(ఆది)నాథుడి దేవాలయం. ఇక్కడ స్వయంభూగా వెలసిన ఆదినాథుడిని భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు. 8లో



ఆగని మట్టి తవ్వకాలు

దెందులూరు మండలం సీతంపేట పంచాయతీలో పాలకుంట చెరువును తవ్వి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. 8లో



అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. 251 గ్రాముల బంగారు ఆభరణాలు, 13 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

రైతుల సమక్షంలోనే రీసర్వే



గుమ్ములూరులో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

ఆకివీడు: రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని గుమ్ములూరులో రీ సర్వే ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. రైతులకు ముందుగా నోటీసులు ఇవ్వాలని, సరిహద్దులు తెలుసుకుని సర్వే చేయాలని సర్వేయర్లకు సూచించారు. రైతులు ఫీల్డ్‌లోకి వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో మండలానికి ఒక గ్రామం చొప్పున రీసర్వే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అనంతరం ఈ–క్రాప్ నమోదు, యూనిక్ ఐడీపై సూచనలిచ్చారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, వీఆర్వో బందా హరిశ్చంద్ర ప్రసాద్, సర్వేయిర్ సాయి ఉన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



తాడేపల్లిగూడెంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ) : స్థానిక వీకర్స్ కాలనీ మూడో వార్డులో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన యువకుడితో బాలికకు ఈనెల 20న వివాహం చేయనున్నారనే విషయం తెలిసి ఇక్కడకు వచ్చి బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయరాదని, బాల్యవివాహాలతో అనర్థాలు తప్పవని కౌన్సెలింగ్ ఇచ్చారు. వివాహ వయసు వచ్చేవరకూ పెళ్లి చేయమని వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. డ్రాప్‌అవుట్ అయిన బాలికను స్కూల్‌లో జాయిన్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ దుర్గాభవాని, మహిళా పోలీస్ విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్ వాణి, టౌన్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

వాసవీ మాత హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ: పెనుగొండలో నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 101 రోజులకు రూ.8,09,083 ఆదాయం వచ్చినట్టు ఈఓ గుబ్బల రామ పెద్దింట్లు రావు తెలిపారు. జిల్లా డీఈఓ ఈవీ సుబ్బారావు పర్యవేక్షించారు. వడలి, జుత్తిగ ఆలయాల ఈఓలు మన్నే శ్రీనివాసు, పీఆర్‌కేఎస్ఎస్ ప్రసాద్, నూలి చినగణేష్, ఆలయ అర్చకులు కోట వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

భీమవరం : జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 73 కేంద్రాల్లో ఉదయం షిఫ్టులో 3,354 మందికి 3,250 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 2,327 మందికి 2,283 మంది హాజరయ్యారని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు.

పొదుల తొలగింపు



పొదులు తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

తణుకు అర్బన్ : 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. తణుకు సజ్జాపురంలో విద్యుత్ స్తంభం, ఎన్జీఓ కాలనీలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనుక ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభాలపై పొదుల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

శిశు ఆధార్ సేవలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ, కామన్ సర్వీస్ సెంటర్ల ఆధ్వర్యంలో 0–5 ఏళ్ల చిన్నారులకు ఉచిత ఆధార్ సేవలు ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రారంభించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ నమోదు చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గైనిక్ విభాగాధిపతి లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నామినేషన్ల ఘట్టం సమాప్తం



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు

- 59 మంది అభ్యర్థులు 72 సెట్ల దాఖలు
- నేడు పరిశీలన.. 13న ఉపసంహరణ
- జిల్లాకు చేరిన ఎన్నికల పరిశీలకురాలు
- ప్రధాన పోటీ పీడీఎఫ్, టీడీపీ అభ్యర్థుల మధ్యే!
- టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల ఆస్తులు రూ.36 కోట్లకు పైనే..

సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఆఖరురోజు 39 మంది అభ్యర్థులు 48 నామినేషన్ల సెట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వికి అందజేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియలు నిర్వహించనున్నారు. ఉపసంహరణల అనంతరం ఉభయగోదావరిలోని ఆరు జిల్లాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, శిక్షణా కార్యక్రమాలు, ఎన్నికల సామగ్రి తరలింపు పనులు చేపట్టనున్నారు.

ఈనెల 3 నుంచి ప్రక్రియ

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తంగా 59 మంది అభ్యర్థులు 72 సెట్లు దాఖలు చేశారు. అత్యధికంగా ఈనెల 8వ తేదీ వరకు 20 మంది అభ్యర్థులు 24 సెట్లు దాఖలు చేశారు. వీరిలో కొందరు సోమవారం మంచి రోజు అని రెండోసారి సెట్లు దాఖలు చేశారు. ఎన్నికల పరిశీలకురాలుగా కె.సునీత నియమితులయ్యారు. సోమవారం ఏలూరు కలెక్టర్, ఎస్పీలతో ఆమె ప్రత్యేకంగా సమావేశమై నామినేషన్ల స్వీకరణ వివరాలు, పోలింగ్ కేంద్రాలు, ఇతర అంశాలపై సమీక్షించారు. చివరి రోజు కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ దాఖలు చేశారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్‌తో పాటు కూటమి ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్ సెట్లను అందజేశారు. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి నామినేషన్ల గడువు ముగిసే వరకు మొత్తం ప్రక్రియను కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు పర్యవేక్షించారు. ఎన్నికల సెల్ అధికారులు ఇతర సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేశారు. అభ్యర్థులకు పూర్తి సహాయ, సహకారాలు అందజేశారు.

టీడీపీ అభ్యర్థి కోటీశ్వరుడు

కూటమి అభ్యర్థిగా టీడీపీ నేత పేరాబత్తుల రాజశేఖరం తన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు చూపారు. తన పేరిట స్థిరచరాస్తులు రూ.22.85 కోట్లు, తన భార్య సత్యవాణి పేరుతో రూ.13.56 కోట్ల ఆస్తులున్నాయని, అలాగే తన పేరిట రూ.2.93 కోట్లు, తన భార్య పేరుతో రూ.1.25 కోట్లు అప్పులున్నాయని పొందుపరిచారు. 1994లో కాకినాడలోని పీఆర్ ట్రస్ట్ కాలేజీలో బీఏ డిగ్రీ పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు రిటైర్డ్ టీచర్ కాగా ఆయన తన పేరున రూ.12 లక్షలు, సతీమణి పేరుతో రూ.68 లక్షలు స్థిరచరాస్తులున్నాయని, అలాగే తన భార్యకు రూ.7.02 లక్షల అప్పు ఉన్నట్టు పేర్కొన్నారు. ఆయన 2000లో ఆంధ్ర యూనివర్సిటీ ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశారు. బరిలో ఉన్న మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు గెద్దం విజయ సుందర్‌కు రూ.3.60 కోట్ల స్థిరచరాస్తులు, రూ.2.17 కోట్ల అప్పులున్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆయన 2011లో కాకినాడ జేఎన్‌టీయూలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు.

ఎన్నికల పరిశీలకురాలిగా సునీత



పరిశీలకురాలు సునీతకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సోమవారం ఏలూరు చేరుకున్నారు. ఆమెకు కలెక్టర్ వెట్రిసెల్వి మొక్క అందించి స్వాగతం పలికారు. జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ పాల్గొన్నారు.

ఆవిష్కరణల కేంద్రంగా ఏపీ నిట్



డెవలప్‌మెంట్ హబ్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ రమణరావు

తాడేపల్లిగూడెం : వినూత్న ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా ఏపీ నిట్ ఉందని ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణరావు అన్నారు. సోమవారం నిట్ ప్రాంగణంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ భవన సముదాయంలో కేంద్ర డిపార్టుమెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సహకారం రూ.7.50 కోట్లతో ఏర్పాటుచేసిన కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పునరుత్పాదక శక్తి వనరులు, విద్యుత్ రంగాల్లో పరిశోధనలు చేపట్టాలన్నారు. పరిశోధనా ఫలాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలన్నారు. ఈ ప్రాజెక్టు ఏపీ నిట్‌కు రావడానికి కృషిచేసిన డాక్టర్ సందీప్, డాక్టర్ శంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. డీఎస్ఐఆర్ శాస్త్రవేత్త సీఆర్‌డీహెచ్ విభాగాధిపతి, డాక్టర్ విపిన్ సి.శుక్లా మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు మరింత పురోగతి సాధించేలా ప్రోత్సహించడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి, డీన్ జీఆర్‌కే శాస్త్రి హబ్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రాజెక్టు ఆఫీసర్లు వి.సందీప్, పి.శంకర్ మాట్లాడుతూ ఈ హబ్ దేశంలో 18వది కాగా, ఎన్ఐటీలలో మొట్టమొదటది అని అన్నారు.

డిప్యూటీ స్పీకర్‌పై ఫిర్యాదు



పాలకోడేరు స్టేషన్‌లో ఫిర్యాదు అందిస్తున్న రవికుమార్

పాలకోడేరు: రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అండతో ఆయన అనుచరులు తనపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని సీనియర్ జర్నలిస్టు, సమాచార హక్కు చట్టం ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి కె.రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తున్న తనకు రక్షణ కల్పించాలని, తనపై తప్పుడు ఫిర్యాదు చేసిన వారిని శిక్షించాలని కోరుతూ సోమవారం పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం ప్రకారం నిజాలు తెలుసుకుని పోరాటం చేస్తున్నానని, దీనిలో భాగంగా పశ్చిమగోదావరి కలెక్టరేట్‌ను భీమవరం నుంచి తరలించే యత్నాలను అడ్డుకుంటూ అఖిల పక్ష కమిటీని కూడా ఏర్పాటు చేసుకున్నామని రవికుమార్ తెలిపారు. ఉండి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పేదల ఇళ్లను అకారణంగా కూల్చివేస్తున్నారని, వాటిని అడ్డుకునే క్రమంలో వార్తలు రాశారన్నారు. కలెక్టరేట్‌ను గతంలో భీమవరం మార్కెట్ యార్డు స్థలంలో మంజూరు చేసి అప్పటి ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం దానిని మార్చి పెదఅమిరంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇంటి పక్కకు మార్చుకునేందుకు యత్నిస్తున్నారని, దీనిపై కూడా వార్తలు రాశానన్న కక్షతో తనను అధికారుల సమక్షంలో అసభ్యకర రీతిలో డిప్యూటీ స్పీకర్ దూషించారని వివరించారు. అప్పటి నుంచి ఆయన అనుచరులు తనను వేధిస్తున్నారని రవికుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొత్తవి లేవు.. ఉన్నవాటికీ కొర్రీ

- పెండింగ్‌లో 20 వేలకుపైగా పింఛను దరఖాస్తులు
- పాత పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో కూటమి కాలయాపన
- అమలుకు నోచుకోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ
- కూటమి పాలనలో 7,075 పింఛన్ల తొలగింపు

సాక్షి, భీమవరం : కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్నారు. ఎన్నికల సభల్లో ఇదే విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారు. కూటమి పాలన చేపట్టి ఎనిమిది నెలలు గడిచిపోగా కొత్త పింఛన్ల మంజూరు ఊసే లేకపోగా.. పింఛన్ల వెరిఫికేషన్ పేరిట ఉన్న వాటికి కొర్రి పెట్టే పనిలో ఉన్నారు.

ఆశలపై నీళ్లు

జిల్లాలో 50 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సుమారు రెండున్నర లక్షల మంది వరకు ఉండగా వారిలో 70 శాతం మంది అర్హులు ఉంటారని అంచనా. కూటమి అధికారంలోకి రావడంతో 50 ఏళ్లకే పింఛన్ హామీ అమలుకోసం ఆయా వర్గాల వారు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంపీడీఓ, డీఆర్‌డీఏ కార్యాలయాల చుట్టూ 50 ఏళ్లు నిండిన అర్హులైన వారు ప్రదక్షిణలు చేస్తుండగా తమకింకా మార్గదర్శకాలు ఏమీ రాలేదంటూ అధికారులు వారిని తిప్పి పంపుతున్నారు.

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల వెల్లువ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే రాజకీయాలు, కులమత వర్గాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేసేవారు. గతేడాది జనవరిలో వచ్చిన దరఖాస్తుల మేరకు జిల్లాలో 4,274 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. మరలా జూలైలో కొత్త మంజూరు రావాల్సి ఉంది. జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి కొత్త పింఛన్ల కోసం 6,350 దరఖాస్తులు ఆన్‌లైన్ అయ్యాయి. ఈ ప్రభుత్వంలోనూ కొత్త పింఛన్ల కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు 15 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. సైట్ ఓపెన్ కాక దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే వీలులేకపోవడంతో వ్యయ ప్రయాసల కోర్చి పేదలు అందజేస్తున్న అర్జీలు ఏమవుతున్నాయో తెలియని పరిస్థితి. తమకు అర్హత ఉన్నా పింఛన్ సాయం అందక నష్టపోతున్నామని పేదవర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

ఉన్న వాటినీ పీకేస్తూ..

గత జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర సామాజిక పింఛన్ లబ్ధిదారులు 2,34,161 మంది ఉన్నారు. ప్రస్తుత ఫిబ్రవరి నాటికి జిల్లాలోని లబ్ధిదారుల సంఖ్య 2,27,086కు చేరింది. గత ఎనిమిది నెలల కాలంలో వివిధ కారణాలతో 7,075 మంది పింఛన్లను తొలగించారు. అధిక శాతం మరణాల వలనే లబ్ధిదారులు తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు అందించే సాయం తగ్గుతోంది. గత ఆగస్టులో జిల్లాలోని లబ్ధిదారులకు రూ.97.25 కోట్లు పింఛన్ సాయం అందించగా ఈనెల రూ.96.72 కోట్లు సాయం అందించారు. ఇదిలా ఉండగా కొత్త పింఛన్లు మంజూరు లేకపోగా వెరిఫికేషన్ అంటూ ఉన్న వాటికి కొర్రి పెట్టే పనిలో పడింది ప్రభుత్వం. జిల్లాలో దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు 27,528 మంది ఉండగా ప్రస్తుతం ఫీల్డ్ వెరిఫికేషన్ పేరిట వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.



పింఛన్ రావడం లేదు



నా భర్త పింఛన్ తీసుకుంటూ గతేడాది ఆగస్టులో మరణించారు. గతంలో పింఛన్ తీసుకుంటూ భర్త చనిపోతే మరుసటి నెల నుంచే భార్యకు పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సచివాలయంలో అడుగుతుంటే సైట్ ఓపెన్ కావడం లేదంటున్నారు.

–సి.భాగ్యవతి, పాలకోడేరు

కాలయాపనతో సరి



పేదవర్గాలకి ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛనే జీవనాధారం. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. ప్రభుత్వం కాలయాపన మాని కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలి.

– పొట్ల సురేష్, న్యాయవాది, తణుకు

హామీని అమలుచేయాలి



50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు అందిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పారు. దీనిపై అధికారులను అడుగుతుంటే ప్రభుత్వం నుంచి ఇంకా విధివిధానాలు ఏమీ రాలేదని చెబుతున్నారు. ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలుచేయాలి.

– దేవ రాజేష్, పోడూరు

నయన మనోహరం.. నారసింహుని కల్యాణం

- ఐఎస్ జగన్నాథపురంలో అట్టహాసంగా వేడుక
- పోటెత్తిన సుందరగిరి



సుందరగిరిపై పాలపొంగళ్లు వండుతున్న మహిళలు



నరసన్న కల్యాణ తంతు జరిపిస్తున్న పండితులు



ఆలయ ధ్వజస్తంభ ప్రాంతంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల : నమో నారసింహ స్మరణలు మార్మోగాయి. జగదానంద కారకుడైన నారసింహుని దివ్య తిరుకల్యాణోత్సవ వేళ ఐఎస్ జగన్నాథపురం క్షేత్రం ఇల వైకుంఠాన్ని తలపించింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి కల్యాణాన్ని తిలకించి తరించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్ర దత్తత ఆలయం ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన లక్ష్మీ నారసింహుని కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణ తంతు నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుని ఉత్సవ మూర్తులను సుందరగిరిపై నుంచి ఉదయం కొండ కింద కల్యాణ మండపం వద్దకు పల్లకీ వాహనంలో తీసుకొచ్చారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న దృశ్యం

ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేసి అలంకరించారు. పరిణయ వేదుకల్లో ఒక్కో ఘట్టాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, కన్యాదానం జరిపి ఉదయం 11.10 గంటల సుముహూర్త సమయంలో స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను జరిపించారు. ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, దేవస్థానం తరపున ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి అన్న ప్రసాదాన్ని అందించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్, సూపరింటెండెంట్ రమణరాజు, డీఈ టి.సూర్యనారాయణ, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీఓ దాసిరాజు

పెనుమంట్ర: నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 27 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ అధికారులతో సమీక్షించారు. గ్రామంలో సిద్ధాంతం–రామేశ్వరం, తాడేపల్లిగూడెం–మార్టేరు రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మద్యం బెల్టు షాపులు లేకుండా చూడాలన్నారు. మహాశివరాత్రి రోజున రాత్రి 12 గంటల వరకు దుకాణదారులు విక్రయాలు జరిపేలా అనుమతి ఇవ్వాలని ఆలయ కమిటీ సభ్యులను కోరారు. సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీఓ ఆలమూరులో జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

క్లుప్తంగా

ఫిజియోథెరపీ వైద్యుడికి అవార్డు



అవార్డు తీసుకుంటున్న నర్సింహరాజు

నరసాపురం: పట్టణానికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపీ అండ్ ఆక్యుపంక్చర్ వైద్యుడు టి.నర్సింహరాజుకు జాతీయస్థాయి బంగారు నంది అవార్డు దక్కింది. హైదరాబాద్‌కు చెందిన తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఏటా తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల వారిని ఎంపిక చేసి అవార్డులు అందజేస్తుంది. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సింహరాజుకు అవార్డు అందజేశారు. ఫిజియోథెరపీ, ఆక్యుపంక్చర్ వైద్యంలో చేస్తున్న సేవలకు ఈ అవార్డు అందించారు.

బెల్లపు ఊట ధ్వంసం



చెక్కపల్లిలో సారా బట్టీపై దాడులు


ముసునూరు: నాటుసారా తయారు చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో సారా బట్టీపై మెరుపు దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏ.మస్తానయ్య సోమవారం తెలిపారు. ముసునూరు మండలంలోని చెక్కపల్లిలోని ఓ ఆయిల్‌పాం తోటలో రహస్యంగా నాటుసారా తయారు చేస్తున్న తాళం రాజుకు చెందిన సారా బట్టీపై ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. దాడిలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. బట్టీ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు


అత్తిలి: భార్యను అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన పాముల సుధారాణితో చాగల్లుకు చెందిన రాజశేఖర్‌కు 2016లో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వివాహ సమయంలో కట్నం కింద రూ.4 లక్షలు, బైక్, ఉంగరం, ఆడపడుచు లాంఛనంగా రూ.10 వేలు ఇచ్చామని బాధితురాలు పాముల సుధారాణి తన ఫిర్యాదులో పేర్కొంది. భర్త కూరగాయలు, కోడిగుడ్ల వ్యాపారంతో పాటు రెండు ఆటోలను కొనుగోలు చేసి వాటర్ ప్లాంట్ అద్దెకు నిర్వహిస్తున్నాడని, కొద్దిరోజుల క్రితం వ్యాపారంలో నష్టం వచ్చిందని రూ. 2 లక్షలు కట్నం తీసుకురమ్మని తనను వేధిస్తున్నాడని తెలిపింది. క్రిస్మస్ పండుగ సందర్భంగా మంచిలి గ్రామంలో తన పుట్టింటికి వచ్చానని, అదనపు కట్నం తీసుకువస్తే కాపురానికి రమ్మని భర్తతో పాటు కుటుంబ సభ్యులు చెప్పారని ఆమె ఫిర్యాదు పేర్కొంది. సుధారాణి ఫిర్యాదు మేరకు ఆమె భర్త పాముల రాజశేఖర్‌తో పాటు అత్త పాముల చంద్రజ్యోతి, బావ పాముల సుబ్రహ్మణ్యం, పెద్ద అత్త సోలిమంటి జయలక్ష్మి, ఆడపడుచు రాయుడు మాలతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు.

జైనుల నీరాజనం

- పెదఅమిరంలో స్వయంభువుగా వెలసిన ప్రథమ తీర్థంకరుడు ఆదినాథుడు
- 2015లో పాలరాతితో ఆలయం నిర్మాణం
- నేడు ఆలయ 10వ వార్షికోత్సవం



ఆదినాథ్ భగవానుడు



పెదఅమీరంలో జైన్ ఆదినాథ్ దేవాలయం

కాళ్ల: దేశంలోని జైనులకు ప్రీతిపాత్రం కాళ్ల మండలం పెద అమిరంలోని ఋషభ(ఆది)నాథుడి దేవాలయం. ఇక్కడ స్వయంభువుగా వెలసిన ఆదినాథుడిని జైనులు భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు. ఇక్కడ జైనుల ప్రథమ తీర్థంకరుడి ప్రతిమ విశిష్టమైన శిల్పకళా నైపుణ్యంతో అలరారుతుంటుంది. ఈ ఆలయంలో ఉన్న తీర్థాధిపతి విగ్రహం సుమారు 2500 సంవత్సరాల పురాతనమైందని భావిస్తారు. జైన తీర్థంకరుల్లో మొదటి తీర్థంకరుడి ఆదినాథుడిని జైనులు పూజిస్తారు. మంగళవారం పదో వార్షికోత్సవం కావడంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ఆదినాథ్ విగ్రహం పెద అమిరం గ్రామంలో సుమారు 150 ఏళ్ల క్రితం పంట పొలాల పక్కన పెద్ద గోతి నుంచి బయటపడిందని ఆలయ నిర్వాహకులు చెబుతారు. ఈ రాతి విగ్రహంపై పిల్లలు ఆడుకునేవారు. రజకులు బట్టలు ఉతికేవారు. కొంత కాలానికి గ్రామంలో కరువు ఏర్పడి భయంకరమైన వ్యాధులు వ్యాపించాయి. గ్రామానికి చెందిన ఒక స్త్రీ కలలో.. ఇది రాయి కాదని దేవుని విగ్రహమంటూ దివ్యవాణి వినిపించింది. ఆ కల గురించి ఆమె గ్రామ పెద్దలకు చెప్పడంతో వారు ఒక దిమ్మ కట్టి దాని మీద ఆ విగ్రహం స్థాపించి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఫలితంగా గ్రామంలో సుఖశాంతులు వెలశాయని చెబుతుంటారు. సుమారు 100 ఏళ్ళ క్రితం గ్రామస్తులు విగ్రహాన్ని జైన విగ్రహంగా భావించి భీమవరంలోని జైనులకు దీని గురించి చెప్పారు. జైనులు ఈ విగ్రహాన్ని పరిశీలించి అది జైన విగ్రహమేనని నిర్ధారించి విగ్రహాన్ని భీమవరం తీసుకువెళ్ళి దేవాలయం నిర్మిస్తామని పెదఅమిరం గ్రామస్తులను కోరగా అందుకు వ్యతిరేకించారు. అప్పుడు భీమవరం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసాపురం, రాజమండ్రి, తణుకులోని జైనులు ఏకమై గ్రామస్తుల సహకారంతో పెదఅమిరంలోనే జైనదేవాలయం నిర్మించారు.

2015లో పాలరాతి దేవాలయం నిర్మాణం

పూర్తి పాలరాతితో ఇక్కడ మందిరం నిర్మించేందుకు ట్రస్ట్ బోర్డు నిర్ణయించింది. 2008లో కోట్లాది రూపాయలతో నూతన పాలరాతి దేవాలయ నిర్మాణం ప్రారంభించి 2015 ఫిబ్రవరి 2న ఆదినాథ్ విగ్రహంతో పాటు మరో 23 విగ్రహాలు ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠ సమయంలో హెలికాప్టర్ ద్వారా ఆలయంపై పూలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రాకారాలపై పాలరాతితో చెక్కిన కళాత్మకమైన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

నేడు పదో వార్షికోత్సవం

పెద అమిరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఆదినాథ్ జైన్ దేవాలయం పదో వార్షికోత్సవ సందర్భంగా భగవాన్ ధ్వజారోహణ కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహిస్తారు. భీమవరం కేసీ బుక్ డిపో అధినేత మహేంద్ర కుమార్ జైన్ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం



ఆదినాథ్ దేవాలయం పదో వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. అత్యంత పురాతనమైన ఆరాధ్య దైవంగా పూజిస్తున్న ఆదినాథుడిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి జైనులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. **దినేష్ కుమార్ జైన్, ఆలయ నిర్వాహకుడు**

మల్లఖంబ పోటీలకు న్యాయ నిర్ణేతగా శేఖర్‌రాజు



జేపీసీ శేఖర్‌రాజు

భీమవరం: భారత ప్రభుత్వం, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్తంగా ఉత్తరాఖండ్‌లో నిర్వహిస్తున్న 38వ జాతీయక్రీడల్లో మల్లఖంబ పోటీలకు భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్ పీడీ జీపీసీ శేఖర్‌రాజు న్యాయనిర్ణేతగా అఫీషియల్‌గా ఎంపికైనట్లు స్కూల్ హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు సోమవారం చెప్పారు. ఈ నెల 10 నుంచి అయిదు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు.

అనాథ మృతదేహం ఖననం



మృతదేహం ఖననానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం బస్టాండ్ రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మృతి చెందిన అనాథకు సోమవారం మానవతా ఆధ్వర్యంలో అంతిమ సంస్కారం నిర్వహించారు. అనాథ మృతదేహం అంతిమ సంస్కార కార్యక్రమానికి సాయం అందించాలని వన్‌టౌన్ పోలీసులు కోరడంతో ఆ మేరకు మానవత సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు ఆధ్వర్యంలో ఖనన కార్యక్రమం నిర్వహించారు.

సీతంపేటలో ఆగని మట్టి తవ్వకాలు



పాలకుంట చెరువులో అక్రమంగా తవ్వుతున్న మట్టి



ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నారు. స్పందించాల్సిన అధికారులు మౌనంగా ఉంటున్నారు. దీంతో మట్టి తవ్వకం తరలింపునకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సీతంపేట పంచాయతీ పాలకుంట చెరువును తవ్వి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రెండు రోజులుగా ఇది జరుగుతున్నా ఉద్యోగులు మౌనంగా ఉన్నారు. ఎలాంటి అనుమతులు లేవని తాము ఇవ్వలేదని స్పష్టం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీ, ఇరిగేషన్, మైనింగ్ శాఖలకు దరఖాస్తు చేసుకుని శాఖపరమైన కొలతల ప్రకారం నిర్దేశించిన నగదును చెల్లించి అనుమతి పొందితే అధికారిక అనుమతి లభిస్తుంది. అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వి తరలిస్తుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వీరరాఘవులు గెలుపు కోసం ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకురాలు కె.సుభాషిణి

చింతలపూడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని జిల్లా ప్రజా సంఘాల నాయకురాలు సుభాషిణి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సోమవారం సమన్వయ కమిటీ సమావేశం జన విజ్ఞాన వేదిక నాయకుడు పి.పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ దిడ్ల వీర రాఘవులు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీలకతీతంగా పీడీఎఫ్ అభ్యర్థిగా గతంలో పోటీ చేసిన ఐ.వెంకటేశ్వరరావు కార్పొరేట్ అభ్యర్థులపై ఘన విజయం సాధించినట్లే ఈ ఎన్నికలలో దిడ్ల వీర రాఘవులు గెలుపొందుతారన్నారు. అన్ని ప్రజా సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, కార్మికులు, పెన్షనర్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రవి మాట్లాడుతూ రాఘవులుకు ప్రజాబలం పుష్కలంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయు మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు, ఎ.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

13 కిలోల వెండి, 251 గ్రాముల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు

ఏలూరు టౌన్: ఏలూరు, పరిసర ప్రాంతాలలో ఇటీవల జరిగిన దొంగతనాల కేసుల్లో నిందితులను గుర్తించి, వారి నుంచి 251 గ్రాముల బంగారు ఆభరణాలు, 13 కిలోల వెండి వస్తువులు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్పీ కేపీఎస్ కిషోర్ సోమవారం విలేకరులకు వివరించారు. డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో, సీఐలు వి.కోటేశ్వరరావు, పి.కృష్ణ,సిహెచ్. రాజశేఖర్, ఎస్సై కె.ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కరుడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను హనుమాన్ నగర్ బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో మరొక ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వెంపల చంటి(భీమవరం), కోసూరి శ్రీనివాసరావు (హైదరాబాదు), సాకా మార్రాజు అలియాస్ ప్రకాష్(భీమవరం), పోతుల అమ్మిరాజు(భీమవరం), గోగులమండ సాల్మన్ రాజు(భీమవరం)లను అరెస్టు చేశారు. వెంపల చంటి, కోసూరి శ్రీనివాసరావు బైక్‌పై వెళ్లి తాళం వేసిన ఇళ్లు గుర్తించి, ఇనుప రాడ్‌తో తాళాలు పగలగొట్టి దొంగతనం చేసేవారు. చోరీ చేసిన ఆభరణాలను మరో ముగ్గురికి ఇచ్చి అమ్మించేవారు. గతంలో పోలీస్ ఉన్నతాధికారులు ఇళ్లలో కూడా నేరాలు చేసిన చరిత్ర వీరికి ఉంది. వీరిపై ఏలూరు, కాకినాడ, గుంటూరు, భీమవరం, హైదరాబాదు, ఖమ్మం సహా వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 16 కేసులు నమోదయ్యాయి. ప్రతిభ కనబరిచిన కైకలూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సైలు వెంకట్ కుమార్, శ్రీనివాస్ ప్రసాద్ తదితరులను ఎస్పీ అభినందించారు.

చోరీ సొత్తు స్వాధీనం



తణుకులో చోరీ సొత్తు చూపిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు అర్బన్: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. సోమవారం తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ముద్దాయిలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తణుకు వీరభద్రపురానికి చెందిన మల్లిపూడి సుధీర్, పల్లేటి రాజేష్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13.93 లక్షల విలువైన 144 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గతంలో నేరచరిత్ర ఉండి పది కేసుల్లో నిందితులుగా ఉన్న ముద్దాయిలు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నారని దర్యాప్తులో తేలినట్లు స్పష్టం చేశారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సైలు చంద్రశేఖర్, జానా సతీష్, డి.ఆదినారాయణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

డెత్ సర్టిఫికెట్ జారీపై గందరగోళం

కుక్కునూరు: తెలంగాణకు చెందిన వ్యక్తికి బతికుండగానే కుక్కునూరు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన విషయం వెలుగు చూసిన నేపథ్యంలో ఎలా జరిగిందనే విషయమై మల్లగుల్లాలు పడుతున్నారు. సోమవారం జరిపిన విచారణలో భూక్యా శ్రీరాములు పేరున ఆన్‌లైన్‌లో డెత్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినట్టు, రిజిస్ట్రేషన్ కానట్టు అధికారులు గుర్తించారు. దీంతో ఆ సర్టిఫికెట్ ఎలా వచ్చిందనే విషయమై స్పష్టత లేదని ఎంపీడీవో నరసింహారావు తెలిపారు. డెత్ సర్టిఫికెట్ జారీ విషయమై అప్పటి సెక్రటరీ మోహన్‌రావు మాట్లాడుతూ, డెత్ సర్టిఫికెట్‌లో సంతకం తనదేనని ఆ సర్టిఫికెట్ జారీ ఎలా అయిందో తనకే అర్థం కావట్లేదు అన్నారు. నకిలీ డెత్ సర్టిఫికెట్ జారీ విషయమై ఎవరెవరు ఉన్నారన్న విషయమై వెలికి తీసేందుకు డెత్ సర్టిఫికెట్ ఎల్ఐసి కార్యాలయంలో సబ్మిట్ చేసిన వ్యక్తిపై సారపాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు మోహన్‌రావు తెలిపారు.

రూ.1.30 లక్షల విలువైన గంజాయి పట్టివేత

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ విశ్వనాథ్ సోమవారం తెలిపారు. తాడేపల్లిగూడెంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రైల్వే గూడ్స్ షెడ్డు రోడ్డులో మోటారు సైకిల్ పార్కింగ్ వద్ద కొందరు వ్యక్తులు గంజాయిని తీసుకువెళ్తున్నారని సమాచారం రావడంతో ఆ ప్రాంతానికి వెళ్లి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వారి నుంచి రూ.1.30 లక్షల విలువైన 13.288 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నల్లి శ్రీనివాస్, కరాటం బాలకృష్ణ, కంకిపాటి నాగరాజు, గుండుగోలు మురళి, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ముసునూరి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. సమావేశంలో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు నాగరాజు, బాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు.. మహిళ అరెస్ట్

పోలవరం రూరల్: ఎల్ఎన్‌డీపేట గ్రామంలో సోమవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనుమతులు లేకుండా మద్యం కలిగి ఉన్న బేతాళ వెంకటలక్ష్మిని అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జి.సునీల్‌కుమార్, హెచ్‌సీ పి.సునీల్‌కుమార్, కానిస్టేబుల్ ఈ.పద్మారావు, పి.రమ్యదుర్గ తదితరులు పాల్గొన్నారు.

● బాల్యం.. దైన్యం



సుందరగిరిపై గాంధీజీ వేషధారణలో భిక్షాటన



క్యూలైన్ల వద్ద గాంధీజీ వేషధారణలో

అందమైన బాల్యం పేదరికం నీడలో కరిగిపోతుంది. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవంలో సోమవారం కనిపించిన దృశ్యాలివి. గాంధీజీ వేషధారణలో ఇద్దరు బాలలు, శక్తి వేషధారణల్లో బాలికలు ఎండలో భిక్షాటన చేస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి చిన్నారులను గుర్తించి స్కూలుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రభుత్వం చేపట్టే సంక్షేమానికి అర్థం ఉండదు

– ద్వారకాతిరుమల



శక్తి వేషధారణలో బాలికలు

హత్యాయత్నం ఘటనలో కేసు నమోదు

ఉండి: ఉండి గొడపేటకు చెందిన కట్టా శ్రీనివాసరావు అనే వ్యక్తిపై దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7న బాధితుడు కట్టా శ్రీనివాసరావు ఇంట్లో ఉండగా అదే ప్రాంతానికి చెందిన కట్టా శివకుమార్ అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి చాకుతో పొడిచి చంపేందుకు ప్రయత్నించాడు. శ్రీనివాస్ తప్పించుకున్నాడు. అనంతరం అతని ముఖం, మర్మాంగంపై దాడి చేయడంతో అతను గాయపడ్డాడు. దీంతో భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మహిళ మృతి



పుట్లచెరువులో మృతిచెందిన మహిళ

మండవల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని పుట్లచెరువులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుట్లచెరువు గ్రామానికి చెందిన పమిడి సుధ(34), భర్త విశ్వేశ్వరరావుతో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. వీరికి బాబు, పాప ఉన్నారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ద్వారా రోజూ కుళాయిల ద్వారా నీటిని అందిస్తారు. కూలికి వెళ్ళి వచ్చిన సుధ మోటార్‌ను వదిలేందుకు వెళ్ళగా ఇంట్లో మోటర్ వైర్ పశువులు లాగేయడంతో గడ్డిలో ఉన్న కరెంటు వైరు చూడకుండా పట్టుకుంది. దీంతో విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మరణించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్వేది ఉత్సవాలకు 8 ప్రత్యేక బస్సులు

నరసాపురం: అంతర్వేది లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 12న జరిగే పౌర్ణమి వేడుకలకు సముద్ర స్నానాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం నరసాపురం ఆర్టీసీ డిపో నుంచి 8 ప్రత్యేక బస్సులు తిప్పుతున్నామని డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. రద్దీని బట్టి అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాలకొల్లు బస్టాండ్ నుంచి ప్రతి 30 నిమిషాలకు ఓ బస్సు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని చెప్పారు. యాత్రికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి విరాళం



కుంచనపల్లి శ్రీవారి ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి ద్వారకా నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీదేవీ, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాత పెదప్రోలు వెంకటాచార్యులు (భాస్కర్), కీర్తిప్రియ దంపతులు రూ.11,116 విరాళాన్ని ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ దాసరి మల్లికార్జునరావుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్ కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు.

బైబిల్ శిక్షకులకు సర్టిఫికెట్ల ప్రదానం



జాన్ రత్నంకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీటీసీ): దైవకార్యం నమ్మకంతో, విశ్వాసంతో బాధ్యతగా చేస్తే దేవుని దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని రంపచోడవరం క్రీస్తు సంఘం సువార్తీకులు బి.జాన్‌రత్నం అన్నారు. పట్టణంలోని క్రీస్తు సంఘం చర్చి వద్ద స్థానిక సువార్తీకులు రొక్కాల నాగబుజ్జి అధ్యక్షతన సోమవారం కృతజ్ఞత ప్రార్ధన కూడిక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిల్ శిక్షణ పూర్తిచేసినవారికి జాన్ రత్నం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జాన్ రత్నంను ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్ధనల్లో క్రీస్తు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: ఇంట్లో ఉన్న చెత్తను పారిశుధ్య వాహనాలకు ఇచ్చే సమయంలో తడి, పొడి చెత్తగా వేరుచేసి ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఒకటో వార్డులోని యర్రా నారాయణస్వామి మునిసిపల్ పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెప్మా సభ్యుల ఆధ్వర్యంలో ఆ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మునిసిపల్ అధికారులు శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్న దాత చిట్టూరి సుజాత, మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫీజు నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. తణుకు రోటరీ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన చిట్టూరి సుజాత సౌజన్యంతో విద్యార్థి కె.సుశాంత్‌కు రూ.10వేలు, కె.నందీశ్వరికి రూ.5వేలు, మేఘనకు రూ.10వేలు అందజేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ కోడూరి రాధాపుష్పవతి, శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: భ్రూణ హత్యలను నివారించడానికి ప్రభుత్వం లింగ నిర్ధారణ నిరోధక చట్టాన్ని తీసుకొచ్చిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్‌కే.దుర్గాభవాని అన్నారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కొండ్రుప్రోలు మెట్ట కాలనీలో తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ దశలో లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, వీటి ద్వారా అబార్షన్లు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మహిళా పోలీసు వీణ, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదల రేటు తగ్గుముఖం

- ఉద్యోగం, చదువు, ఉపాధి కోసం యువత వలస
- తగ్గుతున్న జననాల రేటు
- గూడెం మునిసిపాలిటీ అభివృద్ధికి ఆటంకం



తాడేపల్లిగూడెం: నిధులు దండిగా రావాలన్నా, ప్రతిపాదన దశలోనే ఉన్న అభివృద్ధి పనులు ముందుకు సాగాలన్నా జనాభా సంఖ్య పెరుగుతుండాలి. ఆ దామాషాలోనే ప్రభుత్వాల నుంచి వివిధ ప్రభుత్వ రంగ సంస్థల నుంచి నిధులు వస్తాయి. తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ పరిధిలో వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. గతంలో పురపాలక సంఘాలకు నిధులు రావాలంటే జనాభాను ప్రాతిపదికగా తీసుకొనేవారు. లేని జనాభా లెక్కలను చూపించి గతంలో మునిసిపాలిటీల్లో లక్షకు పైగా జనాభా ఉన్నట్టు నివేదికలు చూపించి నిధులు తెచ్చుకున్న దాఖలాలున్నాయి.గతంలోనూ ఈ విధంగానే లెక్కలు చూపించడంవల్ల డీఎఫ్ఐడీ నిధులు వచ్చాయి. ఈ నిధులతోనే మునిసిపాలిటీలో అభివృద్ధిపనులు చేపట్టారు. ప్రస్తుత ప్రభుత్వాలు, ఆర్థిక సంస్థలు నిధులిచ్చేందుకు జనాభా మంత్రాన్నే జపిస్తున్నాయి. ఈ కోణంలో చూస్తే జనాభా లేకుంటే నిధుల మంజూరు, అభివృద్ధి అడుగుల జోరు తగ్గుతుంది.

ఆశాజనకంగా లేని జనాభా పెరుగుదల రేటు

వాణిజ్య కేంద్రంగా ఉన్న తాడేపల్లిగూడెంలో గడచిన 15 ఏళ్లుగా పట్టణ ప్రజల వలస ఎక్కువగా కనపడుతోంది. ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల పేరుచెప్పి ఇతర ప్రాంతాలకు ఇక్కడి వారు వెళుతున్నారు. పట్టణంలో జనాభా పెరుగుదల రేటు ఆశాజనకంగా లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా లక్ష దాటి ఉంది. ప్రస్తుత జనాభా 14 ఏళ్ల తర్వాత అనధికారిక లెక్కల ప్రకారం చూస్తే లక్షా పదివేలు దాటలేదు. ఏడాదికి సరాసరి పట్టణ జనాభాతో పోలిస్తే జనాభా పెరుగుదల రేటు 1.5 శాతం మించి లేదు. పట్టణం పెంటపాడు, ప్రత్తిపాడు, పెదతాడేపల్లి, ముత్యాలంబపురం వరకు విస్తరిస్తోంది. ఆవాసాలు, కాలనీలు కొత్తగా వెలుస్తున్నాయి. ఆవాసాల్లో ఇద్దరికి మించి నివసించడం లేదు. వయోభారం, లేదంటే ఉద్యోగాల వేటలో ఇతర ప్రాంతాలకు సంతానం వెళ్లగా వారి తల్లిదండ్రులు మాత్రమే ఇక్కడ అధికంగా ఉంటున్నాయి. రకరకాల కారణాలతో ఒక బిడ్డ లేదంటే పిల్లల్ని కనడాన్ని కొన్నేళ్లపాటు వాయిదా వేసుకుంటున్న దంపతుల ఆలోచనా ధోరణి కారణంగా జనాభా పెరుగుదల తక్కువగా ఉంటోందని పలువురు విశ్లేషిస్తున్నారు. జన్యుపరమైన ఇబ్బందులున్న జంటలు, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం తదితర అంశాల వల్ల జననాల రేటు దారుణంగా పడిపోతోంది. పట్టణంలో 35 వార్డులున్నాయి. ఒక్కో వార్డులో మునిసిపాలిటీకి అందిన అధికారిక లెక్కల ప్రకారం ఏడాదికి వార్డులో ఏడుగురు సంతానానికి మించి జన్మించడంలేదని తెలుస్తోంది. గడచిన ఐదేళ్ల గణాంకాలను తీసుకుంటే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఏడాదికి 1,600 మించి జననాలు మునిసిపాలిటీలో జరగడంలేదని లెక్కలు చెబుతున్నాయి. జనన నమోదు కేంద్రంలో అధికారిక లెక్కల ప్రకారం కాకుండా, రికార్డుల్లో నమోదు కాని జననాలను పరిగణనలోకి తీసుకున్నా, జననాల రేటులో ప్రగతి కనిపించడం లేదు. ఈ విషయం తరాల మధ్య అంతరాయానికి దారితీస్తుంది. గడచిన ఐదేళ్లలో మునిసిపాలిటీ పరిధిలో పుట్టిన బిడ్డల గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థం చేసుకోవచ్చు. 2020 నుంచి 2024 డిసెంబరు వరకు మునిసిపాలిటీ పరిధిలో తగ్గుతున్న జననాలకు గణాంకాలు వాస్తవ పరిస్థితికి దర్పణం పడుతున్నాయి.

తాడేపల్లిగూడెంలో శిశు జననాల సంఖ్య

సంవత్సరం	మగ శిశువులు	ఆడ శిశువులు	మొత్తం
2020	1093	969	2,062
2021	1150	1144	2,294
2022	925	960	1,885
2023	936	882	1,818
2024	748	772	1,520

కార్మికులు, కర్షకుల ప్రయోజనానికి ప్రభుత్వాలు పనిచేయాలి



కుంచనపల్లి రైసు మిల్లు వద్ద మాట్లాడుతున్న ఇఫ్టూ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: కార్మికులను కించపరిచేలా కార్పొరేట్ అధినేతల వ్యాఖ్యలు ఉన్నాయని ఇఫ్టూ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుంచనపల్లి రైస్ మిల్లు కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి వ్యాఖ్యలను ఖండించకపోవడం చూస్తుంటే కార్పొరేట్ సంస్థల ద్వారా వ్యూహాత్మకంగా ఉద్యోగులను, కార్మికులను కట్టుబానిసలను చేస్తూ పని భారాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఏ ప్రభుత్వమైనా కార్మికులు, కర్షకుల ప్రయోజనాలకే పనిచేయాలన్నారు. కార్మిక, ఉద్యోగ, కర్షకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. కార్మిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, ముసలయ్య, రమణ, సత్యనారాయణ, ఏసయ్య, సుబ్బారావు, మోషే తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొమ్ముగూడెం ఎంపీపీ స్కూల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ రూపాదేవి



ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది తదితరులు



అత్తిలి ఎంపీయూపీ స్కూల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎంఈవో రమేష్

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వెంకట్రామన్నగూడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో 17,779 మంది చిన్నారులకు 16,179మంది చిన్నారులకు మాత్రలువేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. డాక్టర్ రూపాదేవి, హెచ్‌వీ జ్యోతి, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. మాధవరం పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ ఏవీ వెంకటేష్ అప్పారావుపేట సచివాలయంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5,234 మందిలో 4,961మంది చిన్నారులకు మాత్రలువేసినట్టు ఆయన తెలిపారు. వైద్యాధికారిణి టి.సింధూ, ఎంపీహెచ్‌ఈవో జి.వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ సీహెచ్‌వీ.మణి, ఎస్.అశోక్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తాడేపల్లిగూడెం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీ సరస్వతి అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీసరస్వతి మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయవద్దన్నారు. బాలికలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం అందించాలన్నారు. అనంతరం చిన్నారులకు డీ–వార్మింగ్ మాత్రలు వేశారు. సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రామలక్ష్మి, ఎ.తులసీరాణి, ఎం.శాంతకుమారి, పి. అంజకుమారి, కే.గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సోమవారం స్థానిక సుబ్బారావుపేట 5వ వార్డులోని భవిత దివ్యాంగుల కేంద్రంలో నిర్వహించారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. అర్బన్ హెల్త్ సూపర్‌వైజర్ ఓగిరాల మంగతాయారు నులిపురుగుల నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎస్‌కే బాల ఈశ్వరయ్య, దుర్గా భవాని, సీహెచ్ ప్రశాంతి, సుష్మ మాదురి, కే.కుమారి, సత్యవతి, పూర్ణ, నాగలక్ష్మి, కనకరత్నం, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

అత్తిలి: ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని మండల విద్యాశాఖాధికారి ఎస్ రమేష్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం అత్తిలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 ఎంవీఎలికే ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు టీపీ విజయ్‌కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పి మురళి, జి ప్రమీలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6 నెలలకొకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

ఇరగవరం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.లక్ష్మి క్రాంతి రెడ్డి, ఎంఈఓలు ఐఎస్ శ్రీనివాసరావు, ప్రసాద్‌రావు, హెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులి పురుగు నిర్మూలన మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్టు తెలిపారు. బాలికలకు రక్తహీనత మాత్రలు అందజేశామన్నారు. 6 నెలలకు ఒక్కసారి నులి పురుగులు నివారణ నిమిత్తం మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఇరగవరం పరిధిలో మొత్తం 5,036 విద్యార్థులుండగా, 4,743 మందికి 94.18 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు, స్కూల్ ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది హాజరయ్యారు.

పీహెచ్‌సీ కేంద్రాల్లో..

పెంటపాడు: పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీ కేంద్రాల్లో సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసారు. డాక్టర్లు తోట రాజేష్, మౌనిక, పూజిత, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగుల మాత్రలను మింగించారు. పెంటపాడు పీహెచ్‌సీలో 4,664 మంది విద్యార్థుల్లో 4,304 మందికి మాత్రలు వేసారు. 92 శాతం మందికి మాత్రలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ముదునూరు పీహెచ్‌సీలో 7,703 మందిలో 7,304 మందికి మాత్రలు పంపిణీ చేసారు. 94 శాతం నమోదైనట్టు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు.

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగరాజుకు సత్కారం



తణుకులో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజును సత్కరించిన మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మన్నె నాగరాజు సోమవారం మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కారుమూరి నాగరాజును ఘనంగా సత్కరించారు. అనంతరం కారుమూరి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని సూచించారు. కష్టపడిన వారికి ఎప్పుడూ పార్టీ అండగా నిలబడుతుందని, బీసీ వర్గాలందరికీ మంచి జరిగేలా కృషి చేస్తూ పార్టీని బలోపేతం చేసేందుకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజినల్ కోఆర్డినేటర్ చినిమిల్లి వెంకటరాయుడు, బొండాడకు చెందిన పార్టీ నాయకులు కందుల మల్లేశ్వరరావు, మన్నె శ్రీనివాస్, మందపాటి రవి, చిత్తులూరి కేశవ, మందపాటి శివాజీ పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీటీసీ): అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) 33వ వార్షికోత్సవం సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గొర్రెల సతీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారుల షేక్ వల్లి, రంగా, పోతు శ్రీను విప్లవ గీతాలు ఆలపించారు. సీనియర్ నాయకులు నక్కా ఆనందరావు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. గతేడాది కార్యకలాపాల నివేదికను కార్యదర్శి బత్తిన సత్యనారాయణ ప్రవేశపెట్టగా యూనియన్ నాయకులు నివేదికను ఆమోదించారు. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, కార్మిక చట్టాలు, లేబర్ కోడ్లు, విదేశీ, దేశీయ కార్పొరేట్ శక్తులు, నష్టపోతున్న కార్మికులు, సమ్మె హక్కు తదితర అంశాలపై చర్చించారు. నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడు గొర్రెల సతీష్‌కుమార్, సెక్రటరీ బత్తిన నాగ సత్యనారాయణ, కోశాధికారి యాసరపు పైడన్న, కమిటీ సభ్యులు లచ్చిపతుల శ్రీను, నౌడు బాలాజీ, నాగిరెడ్డి సాయి తేజ, బొబ్బిలి కొండలరావు, రాచర్ల శివలు ఎన్నియ్యారు. కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

లింగ వివక్షను విడనాడాలి



అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : ఆడ, మగ లింగ వివక్షను విడనాడాలని ఇద్దరూ సమానస్థాయి వారేనని 24వ వార్డు యాగర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో బాలికలు ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి సేవలందిస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.విశాలాక్షి తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయించడం చట్టపరమైన నేరమని అటువంటి పరీక్షలు గర్భిణులకు చేయించవద్దని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీడీపీఓ టీఎల్ సరస్వతి ఆధ్వర్యంలో సూజర్‌వైజర్ కె విశాలాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.సుజాత, కె.ప్రసన్న, పీఎస్ సావిత్రి, ఏఎన్‌ఎం జయభారతి, ఆశా వర్కర్ కె బేబిరాణి,, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

పాఠశాలలో పీఎంశ్రీ అభివృద్ధి పనుల పరిశీలన



జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్

తణుకు అర్బన్: విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వస్తున్న ప్రతి సౌకర్యాన్ని నూరు శాతం అందించేలా ఉపాధ్యాయ వర్గాలు కృషి చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్ అన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ పథకంలో పాఠశాల ఎంపికైన సందర్భంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు స్కౌట్స్, గైడ్స్ అమలు, క్రీడా మైదానం అభివృద్ధి, గార్డెన్ సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి, స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు రాధ, నాగరాజ్యం, దిశేంద్ర, నారాయణ, మూర్తి పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి

యలమంచిలి: సొంత భూమి ఉన్న రైతులు యూనిక్ ఐడీ (ఫార్మర్ రిజిస్ట్రీ) నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఈద అనిల కుమారి కోరారు. చించినాడ సచివాలయం వద్ద సోమవారం ఆమె ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకీకరణ (డిజిటలైజేషన్) చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు తెచ్చిన సంఖ్య (యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించనుందని ఆమె వివరించారు. సొంత భూమి గల రైతులు ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు పొందేందుకు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు తమ పరిధిలోని రైతుసేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి తమ పాసుబుక్ జిరాక్స్ లేదా 1బి జెరాక్స్, ఆధార్ జెరాక్స్, ఆధార్ నంబరుకు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకొని వెళ్లాలన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు



ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు ప్రత్యేక బస్సు 36 మందితో సోమవారం రాత్రి బయలు దేరింది. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మంగళవారం శ్రీకాళహస్తి శివస్వామిని, కాణిపాకం వినాయకుడు, శ్రీపురం శ్రీమహాలక్ష్మిదేవి, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అదే రోజు రాత్రికి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం నాలుగో రోజున పట్టణంలో చేరకుంటుందని చెప్పారు. ప్రయాణికుల ఆదరణతో మరిన్ని యాత్ర స్పెషల్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని డీఎం వివరించారు.

కవి ప్రసాద్‌కు లేపాక్షి ఫౌండేషన్ పురస్కారం



వీఎస్‌వీ ప్రసాద్, కవి, తణుకు

తణుకు అర్బన్: నందమూరి తారకరామారావు వర్ధంతి పురస్కరించుకుని అనంతపురానికి చెందిన లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం దక్కింది. మహాకుంభమేళా సందర్భంగా ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కవితల పోటీల్లో చతుర్వేణీ సంగమం పేరుతో కవి ప్రసాద్ రచించిన కవితకు ఉత్తమ పురస్కారం లభించినట్లు ప్రసాద్ తెలిపారు. ఈమేరకు కవి ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న జైమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవని జైభీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గెద్దం సునీల్ గవాస్కర్ అన్నారు. వడ్డిలంక గ్రామంలో గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కామన మారియ్య, నాగమణి, కామన నాగేశ్వరరావు, దుర్గాభవాని కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం కావడంతో ఆ రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రమాద విషయం ఆలస్యంగా తెలుసుకున్న జైభీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు సోమవారం వడ్డిలంక వెళ్లి అగ్ని ప్రమాద బాధితులకు రూ.18 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గెద్దం సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆపదలో ఉన్న వారికి ఈ విధమైన సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఫౌండేషన్ సభ్యులకు ప్రమాద బాధితుల తోపాటు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

మానవత సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీటీసీ): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల బస్సు టైర్ పేలిన ఘటనలో స్థానిక కుమ్మరపేటకు చెందిన ఎస్.రామచంద్రరావు గాయపడటంతో పాటు కాలు విరిగింది. ఆయన ఆర్థికస్థితి అంతంత మాత్రమే కావడంతో సోమవారం మానవత సంస్థ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ.5 వేలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. వై.ఆంజనేయస్వామి, బంగ్గారాజు, సతీష్, ఎగ్గిన శరత్, పాండురంగారావు, బత్తుల ప్రసాద్, రాజశేఖర్, చిన్నా, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

నరసాపురం రూరల్: వేములదీవి పడమరలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం సీతారామాంజనేయల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పెంటపాడు: బైబిలు మిషను వ్యవస్థాపక అధ్యక్షుడు ముంగమూరి దేవదాసయ్య ప్రతి క్రైస్తవునికి ఆచరణాత్మకమైన బోధనలు అందించారని బైబిలు మిషను గవర్నింగ్ బాడీ మెంబర్ మద్దా డేవిడ్ పాల్ (ఆరుగొలను) అన్నారు. మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ముంగమూరి దేవదాసయ్య జ్ఞాపకార్ధ, ఆధ్యాత్మిక వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిలు మిషను వ్యాప్తికి, ఏసయ్య బోధనలు విశ్వవ్యాప్తమయ్యేందుకు దేవదాసయ్య ఎంతో సేవ చేసారన్నారు. రాజమండ్రిలో జన్మించి పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన దేవదాసయ్య ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో తరించారన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాసయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సేవకులు, విశ్వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

